# గాన బాధితుడు

జయంతి శ్రీరామమూర్తి

రామజోగి ఏ ముహూర్తాన ఈ భూఖండంమీద అడుగుపెట్టేడో గాని అతను తలపెట్టిన ఒక్క పనీ సవ్యంగా కొనసాగదు. ఆదిలో హంసపాదులూ, క్షణ క్షణానికీ అడ్డంకులూ రాక తప్పవు. అతడు లక్షణంగా రాచబాటని పోవాలనుకుంటే అది ముళ్ళబాటఅయి వూరుకుంటుంది. అయ్యవారని చెయ్యాలని ఎంత శ్రమపడ్డా అది కోతిగా మారి తుదకు అతన్నే వెక్కిరిస్తుంది. అయినా అతడు మొహంచాటేసుకుని ముందుకు సాగిపోతున్నాడు గనుకనే ఇంకా జీవించి వున్నాడని చెప్పాలి.

రామజోగి రాకరాక ఇంతదూరం ఉద్యోగం నిమిత్తం వచ్చేడు. ఎక్కడి బెంగుళూరు, ఎక్కడి కొండమూర్లంక! "ఇక్కడే ఏదైనా నౌకరీ చూసుకోక పోయావురా" అని మిత్రులు చెబితే, "ఉద్యోగికి దూర భూమియును, విద్వాంసుకు పరదేశమును లేదని పంచతంత్రము. వల్లించేడు. "అంత దూరం వెడుతున్నారు. మమ్మల్ని ఎప్పుడు తీసుకు వెడతారో" అని పత్ని కంటతడి పెట్టగా "వెళ్లగానే ఇలుచూసి" అన్నాడు భర్త.

రామజోగి బెంగుళూరు వచ్చినప్పటి నుంచీ ఇల్లుకోసం వెదుకుతూనే వున్నాడు. అదృష్టవశాత్తూ కొందరు బ్రహ్మచారి మిత్రులు వుండనిచ్చేరు కాని తానే గనక ఈ మూడు నెలలూ హోటలులో వున్నాడా పూర్తిగా ఎప్పుడో ఆరిపోయి వూరుకునే వాడు. కడకు వేటాడగా, వేటాడగా ఎడారిలో నీరు కనిపించినట్లు, రామజోగికి విశ్వేశ్వరపురం దగర ఒక ఖాళీవాటా కనిపించింది. మేడమీది భాగం, క్రింద ఇంటి యజమాని కుటుంబం వుంటున్నారు.



నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది. మేహము, నిశ్శక్త, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20 తు డబ్బి రు. 3-4-0. పోస్టేజిరు.1-1-0
డి. వి. ఎ. అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం. పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా,


సాయంత్రం ఒక ఆఫీసు మిత్రుని వెంట పెట్టుకుని ఆ ఇల్లు తీసుకుందుకు వెళ్లేడు. రామజోగి అతన్ని చూడగానే ఎందుకో మొహం ముడిచేసి ఇల్లు ఖాళీగా లేదన్నాడు యజమాని. ఆ పైన, ఆఫీసు మిత్రుడు బాగా ఘుమాయిషు చేసిన పిమ్మట, "నేనెందుకన్నానంటే, కులగోత్రాలూ, పుట్టుపూర్వోత్తరాలూ తెలియందే మేం ఎవరికీ యివ్వం" అన్నాడు. రామజోగి ప్రవర్తనకి తాను పూచీపడుతానన్నాడు మిత్రుడు. అటుపిమ్మట పిల లెందరన్నాడు. అదీ చెప్పించిమీదట "మీకెంతజీతం వస్తుంది" అన్నాడు ఈ ప్రశ్నకు రామజోగి వొళ్ళు మండింది. "వాడి అద్దెరాళ్ళే వాడికి కావాలి గాని, నాజీతం గొడవ వాడికెందుకు?" అనుకున్నాడు. అయినా, తమాయించుకుని చెప్పేడు. యజమాని ఒప్పుకున్నాడు. నెలకి నలభైరూపాయల చొప్పున మూడు నెలల అడ్వాన్సు యిచ్చి, రశీదుతీసుకు బయలుదేరేడు. దారిలో మిత్రునికి ధన్యవాదాలర్పించి తనయింటివైపు నడచిపోతున్నాడు రామజోగి. తన పత్నీ పుత్రులను పిలవడానికి అవకాశం లభించినందుకు బ్రహ్మానంద పడుతున్నాడు. ఇల్లు చేరినవెంటనే మంచిరోజు కొరకు పంచాంగం విప్పిచూడగా అది శూన్యమాసం అయి వూరుకుంది. తన అదృష్టం ఎలాంటిదో తనకు తెలియనిదికాదు గనక ఎలాగో "ఇంకొక్క పాతికరోజులేగదా" అని సముదాయించుకున్నాడు.

ఆ మర్నాడు రామజోగి యిల్లుమారేడు. అది విశాలంగానూ, అనుకూలంగానూ కనిపించింది అయితే నేం, తాను రోజల్లా ఆఫీసులోనే వుంటాడు. ఉదయం ఎనిమిదింటికి దిగినఘటం సాయంత్రం ఆరింటికిగాని మేడమీద చేరదు. ఆ సాయంత్రం హోటల్లో బడలికగావుండి అయిదింటికే వచ్చేసేడు రామజోగి. క్రితం రోజు సామాను సర్దబట్టి ఒళ్లంతా హూనమయినట్లుంది. మంచంమీద నడుం వాల్చి, సంసారం రప్పించే కల్పనలో నిమగ్నుడయ్యేడు. కళ్ళు అతనికి తెలియకుండానే మూసుకుపోతున్నాయి. శరీరం తేలికయిపోయి, గాలిలో వూగుతున్నట్లనిపించింది.

అలాగ రామజోగి ఎంతసేపు పడివున్నాడో తెలియదుగాని, ఒక్కసారి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. క్రిందినుండి గోలున గోలగా నాలుగైదు గొంతుకలు వినిపిస్తున్నాయి. "పాపం, ఎవరికేం ప్రమాదం సంభవించిందో" అని వెంటనే వెనకవైపు వరండాలోకివచ్చి తొంగి చూసేడు. కాని, తానూహించిన సంచలనం మాత్రం అతనికిక్రింద కనుపించలేదు. 'అది గోలకాదు, నాలుగైదు మానవకంఠాల సామూహిక గానసాధన' అని అతను తెలుసుకున్నాడు. ఆ గొంతుకలు చాలనట్లు ఒక హార్మోనియంకూడా బ్రరు బ్రరున మోగుతూంది. ఆబాధ భరించలేక తలుపు తాళం వేసి, వీధిలోనికి వెళ్ళిపోయేడు రామజోగి.

నాలుగురోజులు గడిచేయి. ఇంటియజమాని కుమార్తెల గానసాధన నిరాఘాటంగా సాగిపోతూంది. రామజోగి ఆరుగంటలనుండి తొమ్మిదివరకూ బయటతిరిగి వస్తున్నాడు. రానురాను సాధన ఓగంట ఎక్కువఅయింది. ఆరాత్రి పదింటికి ప్రక్కమీదవ్రాలి నిద్రాదేవిని ఆహ్వానిస్తున్నాడు రామజోగి. కాని, క్రిందినుండి వచ్చే నాదబ్రహ్మనికి జడిసి ఆదేవి చుట్టుప్రక్కలకు రాసాహసించలేదు. వొళ్ళంతా చెమటలతో నిండినా, రామజోగి తలుపులన్నీ బిడాయించుకున్నాడు. అయినా, ఆశబ్దబ్రహ్మం అతన్ని జాలితలంచలేదు.

ఇక భరించలేక, రామజోగి ఇంటి యజమానిని పిలిచి "చూడండి. ఈ సంగీతం ఇంతసేపు సాగితే నా తలకాయ పగిలిపోతూంది. కాన..." ఆయనతోకత్రొక్కిన త్రాచులాలేచి, "అలాగైతే ఇంకో యిలు చూసుకోవచ్చు. ఇది నాయిల్లు. నా కొంపలో నేనా పిల్లల్ని పాడుకోవదనడానికి నువ్వెవరివి?" అన్నాడు. రామజోగి యిక మాట్లాడలేదు. వచ్చి పక్కమీద వ్రాలి, "దొరక్క దొరక్క యిల్లు దొరికితే యిదేం కర్మ! ఏదో పూరికే యిచ్చినట్లు నిక్కర్షగా చె

చేసేడు. ఈ ప్రపంచంలో మెత్తని వాళ్లని చూస్తే మొత్తబుద్ధి. కర్రలా బిర బిగిసే నే గాని, రోజులు దొరవు." అని ఎంతో సేపు ఆలోచించేడు. అతనిలో ప్రతీకారవాంఛ చిందులు త్రొక్కింది. కాని, 'ఎలాగ?' అనేది ప్రశ్నార్థకంగానే వుండిపోయింది అతని బుర్రలో.

ఆడబోయిన తీర్థ మెదురయినట్లు మరు నాటి సాయంత్రం బజారులో చిన్ననాటి మిత్రుడు సన్యాసిరాజు కనిపించేడు రామ జోగికి. అతన్ని చూడగానే రామజోగి మన సులో ఒక ఆలోచన తళుక్కుమంది.

"ఇక్కడేం చేస్తున్నావురా సన్యాసి రాజూ" అన్నాడు జోగి.

"బట్టలమిల్లులో పని చేస్తున్నాను" అన్నాడు రాజు.

"అయితే, సన్యాసీ! నువ్వు చిన్నప్పుడు మద్దెల నేర్చుకునేవాడివి. ఇంకా వాయి స్తున్నావా, మానేసేవురా?"

"మానలేదు. కాని, నేనున్న బసలో తీరిగ్గా వాయించుకుందుకు వీలుపడదు. అదేగదిలో ఇంకో ముగ్గురు స్నేహితు లున్నారు. వాళ్లు తీరిగ్గా మద్దెలమాట విప్పనివ్వరు" అని వాపోయేడు సన్యాసి రాజు. రామజోగికి అమృతం వర్షించి నటయింది.

"అయితే ఓ పని చెయ్యి. నేను విశ్వే శ్వరపురంలో వుంటున్నాను. నీ మద్దెల తెచ్చి నా గదిలో పెట్టుకో. సాయంత్రం ఆరునుండి ఎనిమిదిదాకా నీయిష్టం వచ్చి నట్లు సాధకం చేసుకో. అక్కడ నిన్నెవ్వ రెవరూ వుండరు" అన్నాడు రామజోగి. సన్యాసి మొహం విప్పారింది.

మరునాడు సన్యాసి విశ్వేశ్వరపురంలో తన మృదంగసాధన మొదలుపెట్టేడు. ఇంటి యజమానికి బుద్ధిచెప్పేందుకు ఇటువంటి అవకాశం లభించినందుకు సంతసించేడు రామజోగి. మొదటిరోజు వాయిద్యం సాగిన రెండుగంటలూ ఇంటియజమాని పిలుపు కోసం ఎదురుచూసేడు, కాని ఆ పిలుపు రాలేదు. రాత్రి తొమ్మిదింటికి ఆయన క్రిందినుండిపిలిచి, "ఎవరు ఈ మద్దెల వాయి స్తూంట? మీరా?" అన్నాడు.

"మా స్నేహితుడు నేర్చుకుంటున్నాడు" అన్నాడు రామజోగి. ఇంటాయన ఇంకేమీ ప్రశ్నించలేదు. జోగి అంతకన్నా మాట్లాడ లేదు.

ఆ మరునాటినుంచీ సన్యాసిరాజు వచ్చి ఆరింటినుండి ఎనిమిదింటివరకూ సాయం కాలం నిరాఘాటంగా మృదంగ సాధన చేసుకునేవాడు. రామజోగి ఆ రెండుగంట లూ షికారుతిరిగివచ్చి, "ఇంటివాడేమన్నా అన్నాడా" అనేవాడు. "లేదు" అని జవాబు. రామజోగికి ఇంటివాడు ఊరుకో వడం ఆశ్చర్యకరంగానే కనిపించింది. మద్దెల హోరుపడలేక సంగీతపుజోరు తగ్గించి తనతో రాజీకి వస్తాడనుకున్న రామజోగిఊహ ఫలిం చడంలేదు. సంగీతసాధన రాత్రి పదింటి దాకా సాగిపోతూనేవుంది.

పదిరోజులు గడచినమీదట రామజోగి మిత్రుని మృదంగసాధన ఇంకోగంట పెంచ మన్నాడు. సన్యాసిరాజు 'సరే' అన్నాడు. ఆ మర్నాడు రామజోగి సాయంత్రం ఆఫీసు నుండివచ్చి మెట్లెక్కుతున్నాడో లేదో వీధిలో జట్కాబండి వచ్చి ఆగింది. జోగి వెనుతిరిగి చూసేడు. సన్యాసిరాజు సామా నంతా దింపుకుంటూ "బస అక్కడా, సాధకం ఇక్కడా బాగాలేదు. అందుకని ఇక్కడే వుండడానికి సామానుతో వచ్చే సేను" అన్నాడు.

రామజోగి నోరు మండింది.

"అదెల్లా వీలుపడుతుంది? నా సంసారం వస్తోంది ముందు వారంలో"...అని రామ జోగి అంటూండగా, ఇంటి యజమానివచ్చి "మీ మిత్రుడు ఘనమైన మార్దంగికుడు. మా అమ్మాయిల పాటకీ, ఈయన వాదనకీ మత్ర కుదిరినట్లు సరిపోయింది. ఇక తెల్లవారూ ప్రాక్టీసు చేసుకున్నా ఫరవాలేదు. ఇదిగో, ఈ క్రిందగది ఖాళీచేసేను. చూసారేం, సామాను లోపల పెట్టించండి" అన్నాడు.

రామజోగి కాళ్ళక్రింద భూమిగడ్డ ఎవరో పీకేసినటయింది.

"అయితే తమసాధకం ఈ వేళనుండీ క్రిందనన్నమాట" అన్నాడెలాగో. కాని జవాబుకు ఎదురు చూడలేదు. అతని గుండెల్లో సహస్ర మృదంగధ్వానాలు ప్రతి ధ్వనిస్తున్నాయి. తలకాయ రెండు చేతు లతో పట్టుకొని, అదే జట్కాలో ఎక్కి "బసవన్నగుడికి" అన్నాడెలాగో. ★



"చూశారూ! ఈ హోటల్లో తయారుచేసే పదార్థాలను చివరకు కాకిఅయినా ముట్టదు!"